# తుంగభద్ర లోతట్టు కాలువ 'ఆధునీకరణ'పై

# రైతాంగం ఆందోళన - 15 రోజుల నిరవధిక ధర్నా

**కర్ణాటక** రాష్ట్రం తుంగభద్ర పరివాహక ప్రాంతంలో సిరిగుప్ప తాలూకాలో తుంగభద్ర లోతట్టు ప్రధాన కాలువకు ఆధునీకరణ చేపట్టే సమయంలో బోర్డు అధికారులు మార్పు చేయడాన్ని గమనించిన రైతులు దిగువ ప్రాంతాలకు నీటి పారుదల కష్టమవుతుందని వందలాది మంది ప్రధాన కాలువ 68/300 కిలోమీటర్ వద్ద ఆందోళనకు దిగారు. పనులు చేపడుతున్న అధికారులను నిలదీశారు. ఫలితం లేకపోవడంతో నిరవధిక ధర్నాకు పిలుపునిచ్చి కాలువ పక్కనే ధర్నా చేపట్టారు. వందలాది మంది రైతులతో 2-6-19 నుంచి పదిహేను రోజులపాటు ఈ ధర్నా, నిరాహార దీక్షలు కొనసాగాయి.

కర్ణాటక రాజ్య రైతు సంఘ(ఏఐకెఎంకెఎస్ అనుబంధం) ఆధ్వర్యంలో సాగిన ధర్నాలో చుట్టుపక్కల ప్రాంతాల రైతాంగం, సిరిగుప్ప, బళ్ళారి ప్రాంత రైతు సంఘం నాయకులు ఆర్.మాధవరెడ్డి, హులిగప్ప,లేపాక్షి, తిమ్మనగౌడ, సత్యనారాయణరెడ్డి, రామనగౌడ తదితరులు నాయకత్వం వహించారు. పనులు ఆపివేశారు. దాంతో 17-6-19న టీబీ బోర్డు సిఈ ఆధ్వర్యంలో ధర్నా స్థలంలో చర్చలు జరిగాయి.

సీఈతోపాటు పదకొండుమంది పాల్గొన్నారు. అధికారులంతా ఆధునిక పరిజ్ఞానంతో సర్వేచేసి నిర్ణయించామని, ప్రాజెక్టు డిజైనింగ్‌లో వున్న మేరకే పనిచేస్తున్నామని రైతులతో చెప్పారు. కానీ రైతులు తమకు తెలిసిన వ్యవసాయ జ్ఞానంతో నీరు ఎక్కడ పారుదల కష్టం అవుతుందో చూపుతామని కాలువలో మళ్లీ కొలతలు తీయమన్నారు. సి.ఈ. సమక్షంలో కొలిపించారు. రైతుల సమక్షంలో జరిగిన సర్వేలో వాస్తవాలు వెలుగుచూడడంతో గతంలో వున్న వెడల్పు- లోతుల ప్రకారమే పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వేలాది ఎకరాల నీటిపారుదలకు తీవ్రమైన సమస్యగా మారబోయిన ఈ ఆధునీకరణ సమస్యను రైతు సంఘం సరైన సమయంలో చైతన్యం ప్రదర్శించి కాపాడుకోగలిగింది. ధర్నా జరుగుతున్న 15 రోజులపాటు అధికారులు అనేక రకాల ప్రలోభాలకు గురిచేయడానికి పూనుకున్నా రైతులు లొంగక నిజాయితీగా నిలబడడంతో రైతుల సమస్య పరిష్కారమైంది. చాగనూరు మల్లిఖార్జునరెడ్డి (అడ్వకేట్), మరికొందరు మేధావులు రైతులకు అండగా నిలిచారు.

oooo